క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

నిజామాబాద్‌రూరల్: నగరంలోని సరస్వతినగర్‌లోగల కెనరా బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో బుధవారం బ్యాంక్ సహకారంతో ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి డీఈవో దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. బ్యాంకు సేవలను కొనియాడారు. కెనరా బ్యాంక్ ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా తమ బ్యాంక్ ద్వారా అంబేడ్కర్ విద్యా జ్యోతి స్కీం కింద పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు.

'సమగ్రత ప్రతిజ్ఞ'



నిజామాబాద్‌అర్బన్: నగరపాలక సంస్థ ఉద్యోగులతో బుధవారం కమిషనర్ మకరంద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విధుల్లో ఎలాంటి పొరపాట్లు, అవినీతి చేయబోమని సిబ్బందితో 'సమగ్రత ప్రతిజ్ఞ' చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు కలిశారు. హైదరాబాద్‌లోని రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం రాష్ట్రపాలక మండలి, జిల్లా చైర్మన్‌ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ హాజరై, మాట్లాడారు. రెడ్‌క్రాస్ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. డ్రగ్స్‌పై పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పోస్టర్లను విడుదల చేశారు. గవర్నర్‌ను జిల్లా సభ్యుడు తోట రాజశేఖర్ కలిసి మొక్కను అందజేశారు. రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా, ఐఏఎస్ రిటైర్డ్ గవర్నర్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లు, భవాని శంకర్, ఓఎస్ రెడ్డి పాల్గొన్నారు.

విచారణకు రాకపోతే చర్యలు

సిరికొండ: మండల కేంద్రంలోని సొసైటీలో జరిగిన అక్రమాలపై మాజీ సీఈవోలు విచారణకు హాజరు కాకపోతే తగిన చర్యలు తీసుకుంటామని విచారణ అధికారి పోశన్న తెలిపారు. ఈమేరకు మాజీ సీఈవోలకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యాలయంలో విచారణాధికారి పోశన్న, ఆనంద్‌లు బుధవారం విచారణకు హాజరయ్యారు. ముగ్గురు మాజీ సీఈవోలు విచారణకు హాజరు కాలేదు. మరో ఇద్దరు మాజీ సీఈవోలు ప్రస్తుతం సొసైటీలోనే పనిచేస్తున్న సిబ్బంది భూపతిరెడ్డి, గిరిరాజ్‌లను వారు విచారించారు.

బాధ్యతల స్వీకరణ


సిరికొండ: సిరికొండ పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎల్ రామ్ బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా కేంద్రంలోని రెండో టౌన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన రమేష్ జిల్లా కేంద్రంలోని సీసీఎస్కు బదిలీ అయ్యారు.

ధర్పల్లి: ధర్పల్లి ఎస్సైగా రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జగిత్యాల జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన విక్రమ్ నిజామాబాద్ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు.

బాల్కొండ ప్రజాప్రతినిధులకే జెండా ఆవిష్కరణ అవకాశం

ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లా కేంద్రంలో ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రులు లేదా ఇన్‌చార్జి మంత్రులు జెండా ఆవిష్కరణ చేస్తారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. ప్రస్తుతం బాల్కొండకు చెందిన మాజీ విప్, ప్రస్తుత రాష్ట్ర మైనింగ్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు అవకాశం దక్కింది. దీంతో ఇప్పటి వరకు 11 సార్లు బాల్కొండ నియోజకవర్గం ప్రజాప్రతినిధులకు అవకాశం లభించడం కొసమెరుపు.

రాజీవ్‌గాంధీతోనే టెక్నాలజీ అభివృద్ధి



ఖలీల్‌వాడి: స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీతోనే దేశంలో టెక్నాలజీ అభివృద్ధి చెందిందని రాజీవ్ జ్యోతి యాత్ర చైర్మన్ ఆర్ దొర్హై అన్నారు. కంఠేశ్వర్ బైపాస్ నుంచి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్ వరకు బుధవారం వారు రాజీవ్‌గాంధీ జ్యోతియాత్ర నిర్వహించారు. నాయకులు కేశ మహేష్, సంతోష్, ప్రీతమ్, లవంగ ప్రమోద్, బొబ్బిలి రామకృష్ణ, రాజనరేంధర్ గౌడ్, అదే ప్రవీన్ తదితరులు ఉన్నారు.

ప్రక్షాళన దిశగా మున్సిపల్

- ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారికి బదిలీలు
- ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్



నిజామాబాద్‌అర్బన్: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య, ఆరోగ్య విభాగంలో పలువురిని బదిలీ చేస్తూ కమిషనర్ మకరంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రెవెన్యూ విభాగం ఉద్యోగి నరేందర్ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడి చేయడం, పెద్ద మొత్తంలో డబ్బు, నగలు దొరకడంతో కేసు నమోదు అయింది. ఈనేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్‌పై అనేక విమర్శలు వచ్చాయి. దీంతో పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి అవినీతి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో కమిషనర్ కార్పొరేషన్‌లోని ఆయా విభాగాలలో బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఆరోగ్యం, పారిశుధ్యం విభాగంలో హెల్త్ సూపర్‌వైజర్‌లను బదిలీలు చేశారు. గత కొన్నేళ్లుగా ఒకే విభాగంలో కొనసాగుతున్న ఉద్యోగులందరినీ బదిలీ చేయనున్నట్లు తెలిపారు. ఈ బదిలీల తర్వాత పనుల విభాగం, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగంలోనూ బదిలీలు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు

బదిలీ అయ్యింది వీరే..

నాలుగవ జోన్ (బి) విభాగంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రశాంత్‌ను ఒకటవ సర్కిల్‌కు బదిలీ చేశారు. నాల్గవ సర్కిల్‌లోని ఏ విభాగంలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ సునీల్ కుమార్‌ను రెండవ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఐదవ సర్కిల్‌లో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ మహిపాల్‌ను మూడవ సర్కిల్‌కు బదిలీ చేశారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ కుమార్‌ను నాలుగవ సర్కిల్‌లోని శానిటేషన్ స్టోర్‌కు బదిలీ చేశారు. మినీ ట్యాంక్‌బండ్ వద్ద పనిచేస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షాదుల్లా హుస్సేన్‌ను నాలుగో సర్కిల్ బి విభాగానికి బదిలీ చేశారు. మూడవ సర్కిల్‌లో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ శ్రీకాంత్‌ను ఐదవ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఒకటో సర్కిల్‌లో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాసును డంపింగ్ యార్డ్‌కు బదిలీ చేశారు. రెండో సర్కిల్‌లో పనిచేస్తున్న హెల్త్ సూపర్ వైజర్ నటరాజ్ గౌడ్‌ను మినీ ట్యాంక్‌బండ్, వైకుంఠ ధామాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ విభాగానికి బదిలీచేశారు. డంపింగ్ యార్డులో పనిచేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ సోలోమన్ రాజును మున్సిపల్ వాహనాల విభాగానికి బదిలీ చేశారు.

ఔట్‌సోర్సింగ్‌కే అందలం..

బదిలీల్లో ముఖ్యమైన ప్రాంతాల్లో రెగ్యులర్ ఉద్యోగులను కాదాని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించడంపై విమర్శలు వస్తున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులుగా ఉన్న ముఖ్యమైన వారిని ప్రాధాన్యత లేని ప్రాంతాలకు బదిలీ చేశారు. అలాగే ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ముఖ్యమైన జోన్ 1, 2, 3, 4లకు బదిలీ చేశారు. కాగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో కొందరు గతంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు పునరాలోచించి బదిలీల్లో రెగ్యులర్ ఉద్యోగులకు ప్రాధాన్యత ప్రాంతాలకు కేటాయించాలని కోరుతున్నారు. ఓ అధికారి హుటాహుటిన ఆకస్మిక బదిలీలను నిర్ణయించి సెలవులో వెళుతున్నట్లు తెలిసింది.

అఖండ భారత్ విభజన పాపం కాంగ్రెస్‌దే



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: అఖండ భారతదేశాన్ని విడగొట్టిన పాపం కాంగ్రెస్‌దేనని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. నగరంలోని వినాయక కల్యాణ మండపంలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అధ్యక్షతన దేశ విభజన భయానక స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు చెందిన మహేష్ సిర్పుర్కర్, మంగేష్ కుమార్ సిర్పుర్కర్‌ను సన్మానించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. ఆగస్టు 15, 1947 దేశానికి స్వాతంత్ర్యం ప్రకటనతో అఖండ భారతదేశంలో ప్రజలందరూ సంతోషిస్తున్న తరుణంలో అప్పటి రాజకీయ నాయకులు, మహ్మద్ అలీ జిన్నాకు భయపడి మత ప్రాతిపదికన రెండు ముక్కలుగా విభజించారని తెలిపారు. నేడు హిందువులపై ఇంతటి దారుణాలు జరుగుతున్నా సెక్యులర్ పార్టీల నాయకుల కళ్లకు కనబడటం లేదని ఎద్దేవా చేశారు. నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్ రెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, మల్లేష్, నారాయణ, పంచరెడ్డి ప్రవళిక, నాగరాజు, శంకర్, మధు, ప్రభాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

- జిల్లా జట్టులో జాతీయ జట్టు క్రీడాకారిణి గుగ్లోత్ సౌమ్య

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 16నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈసందర్భంగా పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మీర్ ఫరూక్ అలీ,మొహమ్మద్ జావేద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కవిత టోర్నీ చైర్‌పర్సన్ సౌజన్యంతో పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా జట్టులో భారత జట్టు క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య పాల్గొనడం కొస మెరుపు. జిల్లా జట్టుకు చీఫ్ కోచ్‌గా భక్త పాల్, మేనేజర్‌గా మొహమ్మద్ అజ్మత్‌ఖాన్, అసిస్టెంట్ కోచ్‌గా నాగరాజు ఉన్నారు.

జిల్లా జట్టు..

రోనిష,అశ్విని, నక్షత్ర, రష్మిక, మధుశ్రీ,, విజయలక్ష్మి, గుగ్లోత్ సౌమ్య, సహస్ర, మోక్ష తపస్వి, సాయిసమీక్ష, ప్రజ్ఞ, సింధూర, శ్రీష్మ, శుశాంతిక, హరిని, జహాన్వి, లహరి, గీతిక చౌదరి, నిషిత, మాధవి, సంజన, ఏ రిశ్విక, అలిన జరీన్, మనస్విని, నిర్వి, సయిాద సలేహ ఫాతిమా ఎంపికయ్యారు.

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలి



డిచ్‌పల్లి ఆస్పత్రిలో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి/నిజామాబాద్ నాగారం/ఇందల్వాయి: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ, వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ సూచించారు. డిచ్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)ని, ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన నాణ్యమైన వైద్యసేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఘన్‌పూర్ గ్రామ పంచాయతీని, గన్నారం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు.నగరంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను పరిశీలించారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సంజన, ఎంపీడీవో రవీందర్, మండల పరిషత్ అధికారి రాజ్‌కాంత్, కమ్యునిటీ హెల్త్ అధికారి జేమ్స్, ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్, సీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం నిజామాబాద్ జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి, నిరసన తెలిపారు. అంతకుముందు నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ అధ్యక్షతన న్యాయవాదులు సమావేశం నిర్వహించి, ఈవిషయమై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. జగన్ మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హత్యలు, దాడులు ఆస్తుల ధ్వంసంపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, రాజకీయ పార్టీలు స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. నిరాశ్రయులైన హిందువులకు భారత ప్రభుత్వం ఆశ్రయం ఇచ్చి, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బార్ ప్రతినిధులు రాజేందర్ రెడ్డి, వసంత్ రావు, సురేష్, శ్రీకాంత్, వెంకటేశ్వర్, విఘ్నేష్, గంగాధర్, మాణిక్ రాజ్, రవి, విశ్వక్‌సేన్ మధు, నారాయణ, దేవదాస్, పుణ్యారాజ్, బాలాజీ, ఆశ నారాయణ, సుదర్శన్‌రావు, రవిప్రసాద్ పాల్గొన్నారు.

జనప్రియనగర్ సమస్యలను పరిష్కరిస్తాం



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని జనప్రియనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు అన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై సాక్షి దినపత్రికలో బుధవారం 'అధ్వానంగా జనప్రియనగర్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి, కాలనీని సందర్శించి, సమస్యలను గుర్తించారు. ఇళ్ల మధ్య, రోడ్లపై నిలిచిన నీటిపై దోమల మందు స్ప్రే చేశారు. రోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేస్తామని కాలనీవాసులతో వారు పేర్కొన్నారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు ప్రారంభం

ఖలీల్‌వాడి: జిల్లా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో యూత్ కాంగ్రెస్ యాప్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 18 నుంచి 35 సంవత్సరాలు కలిగిన యువకులు యూత్ కాంగ్రెస్ ఎన్నికల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. అధ్యక్ష పోటీలోనిజామాబాద్ అర్బన్ నుంచి విపుల్‌గౌడ్, ఆద్నాన్, రూరల్ నుంచి నరేష్, సాయికిరణ్, ఆర్మూర్ నుంచి శ్రీకాంత్, బాల్కొండ నుంచి నాగేంధర్ పోటీలో ఉన్నారు. అలాగే ప్రధాన కార్యదర్శి కోసం 19మంది పోటీ పడుతున్నారు. జనరల్ ఎన్నికల మాదిరిగానే యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరగడం చర్చనీయాంశంగా మారింది. అధ్యక్ష పదవీ ఏకగ్రీవం కోసం జిల్లా ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎన్నికలు అనివార్యం అయ్యాయి. ఈ ఎన్నికలు సెప్టెంబర్ 14 వరకు కొనసాగుతాయని పార్టీ నేతలు పేర్కొన్నారు.

దేశ విభజన.. చరిత్రలో చీకటి అధ్యాయం



సుభాష్‌నగర్: అఖండ భారతదేశాన్ని కొందరి స్వార్థ రాజకీయాల కోసం విభజించడం చరిత్రలో చీకటి అధ్యాయమని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్ శివకుమార్ జీ పేర్కొన్నారు. నగరంలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో బుధవారం అఖండ భారత్ సంకల్ప దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ మహిళలపై పైశాచికంగా దాడులకు పాల్పడుతున్నా మానవహక్కుల సంఘాలు, మేధావులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ప్రపంచంలోని హిందువులకు మనమంతా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు సుమిత్‌కుమార్, అరుగుల సత్యం, భార్గవ్, విశాల్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో తిరంగా ర్యాలీ



డిచ్‌పల్లి: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతపట్టి విద్యార్థులు, యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని కోరారు. నాయకులు గద్దె భూమన్న, వెంకటరమణ, రవిగౌడ్, చౌకి లక్ష్మన్, సతీష్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సురేష్, నాగేష్ పాల్గొన్నారు.

సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి



సుభాష్‌నగర్: జిల్లాకేంద్రంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమ సమన్వయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వారు ఎంపీ అర్వింద్ ధర్మపురిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, షేక్ హుస్సేన్, మోహన్ దాస్, ఈవీఎల్ నారాయణ, నవీన్‌కుమార్, రాజశేఖర్, నారాయణ ఉన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: నాగారంలోని డైట్ కళాశాలలో అతిథి అధ్యాపకులను నియమించనున్న నేపథ్యంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఈడీ లేదా ఎంపీఈడీ, ఎంఎఫ్ఏ, బీఎఫ్ఏ అర్హత ఉన్నవారు దరఖాస్తులను ఈనెల 21 తేదీలోగా డైట్ కళాశాలలో సమర్పించాలన్నారు. మెరిట్, ఇంటర్వ్యూ, డెమో ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అతిథి అధ్యాపకులకు నెల కు రూ.23,400, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల కు రూ.15,600 గౌరవేతను అందించనున్నట్లు తెలిపారు. ఫిలాసఫీ, సోషియలాజీ, గణిత శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘికశాస్త్ర బోధన పద్ధతులు, వ్యా యామ విద్య, కళా విద్యల్లో ఒక్కో పోస్టును, ఉర్దూ విభాగంలోనూ ఫిలాసఫీ, సోషయాలజీ, సామాన్య శాస్త్ర బోధన పద్ధతులు, గణిత శాస్త్ర బోధన పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధన పద్ధతులు, ఉర్దూ బోధన పద్ధతులకు సంబంధించి ఖాళీగా ఉన్న ఒక్కో పోస్టును భర్తీ చేయనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి కోసం..

నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించలనుకునే పేద ఎస్సీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అక్టోబర్ 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తం

ఆర్థికసాయం అందజేత

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన సందీప్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో దుబాయ్‌లో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బుధవారం గల్ఫ్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.40వేల ఆర్థికసాయం అందించారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.35వేలను అందజేశారు.

'జాతీయ సమావేశం'లో జిల్లా నాయకులు

నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లో బుధవారం అఖిలభారత ఉద్యోగ సమాఖ్య అత్యవసర జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాతీయ అధ్యక్షుడు సుభాష్ లంబాజీ, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్‌లతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొని, మాట్లాడారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆలుక కిషన్, ప్రధాన కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, బూట్ల పంపిణీ

మోపాల్/సిరికొండ/జక్రాన్‌పల్లి: మోపాల్ మండలం సిర్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బుధవారం ఉపాధ్యాయులు యూనిఫాం, బూట్లు, సాక్సులు, ఐడీ కార్డులు, బెల్టులు, విద్యార్థినులకు రిబ్బన్లు అందజేశారు. సిరికొండ మండలంలోని రావుట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పీఏసీఎస్ డైరెక్టర్ బాబన్న, సోదరుడు బాలకిషన్ టై, బెల్టులను విరాళంగా అందచేశారు. జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు టై, బెల్టులను జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు విజయానంద్, శ్రీలత పంపిణీ చేశారు.

గురుకుల కళాశాలలో ఎన్నికలు

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో బుధవారం విద్యార్థినులకు ఎన్నికలు నిర్వహించారు. కళాశాల కెప్టెన్, వైస్ కెప్టెన్, కల్చరల్ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లిటరరీ సెక్రటరీలను విద్యార్థినులు ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

పాఠశాలలో రేకుల షెడ్డు నిర్మాణం

సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సభాస్థలి వేదికపై 2004–05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రేకుల షెడ్డు నిర్మాణం చేయించారు. వేదిక నిర్మాణానికి కృషి చేసిన పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

బస్ షెల్టర్‌కు రంగులు

సిరికొండ: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో గల బస్ షెల్టర్‌కు గ్రామానికి చెందిన పెయింట్స్ దుకాణం యాజమాని కనగందుల సతీష్ రంగులను విరాళంగా అందించారు. వీడీసీ ఆధ్వర్యంలో బుధవారం రంగులను వేయించారు.

వీరబ్రహ్మేంద్రస్వామిని భక్తిశ్రద్ధలతో పూజించాలి

నిజామాబాద్ రూరల్: వీరబ్రహ్మేంద్ర స్వామిని భక్తి శ్రద్ధలతో పూజించాలని వీరభద్ర స్వామి తెలిపారు. నగరానికి బుధవారం శ్రీమద్విరాట పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 8వ తరం వీరభద్ర స్వామి దంపతులు విచ్చేశారు. వారిని భక్తులు సన్మానించారు. తంగళ్ళపల్లి శ్రీనివాస్, మహేష్, కృష్ణ, కిరణ్, నందప్ప, ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోండి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని 13వ డివిజన్‌లో సర్వేనెంబర్ 19లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం వారు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

సఫాయి కార్మికులకు అవగాహన

నిజామాబాద్‌రూరల్: నగరంలోని ఆనంద్‌నగర్‌లో గల వాల్మీకి కమ్యూనిటీ భవనంలో బుధవారం సఫాయి కర్మాచారి ఆందోళన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సఫాయి కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కమ్మరి సరస్వతి తదితరులు ఉన్నారు.

సీపీకి వినతి

ఖలీల్‌వాడి: హెల్మెట్ వాడకం ఇప్పుడే అమలు చేయవద్దని కాంగ్రెస్ నేతలు బుధవారం సీపీ కల్మేశ్వర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ముందుగా వాహనాదారులకు పోలీస్‌స్టేషన్ పరిధిలో హెల్మెట్‌పై అవగహన కల్పించాలని సీపీని కోరారు.

ఒకరిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జెండాగల్లీలో ఇద్దరు కానిస్టేబుళ్లపై దురుసుగా ప్రవర్తించిన శేఖర్‌రెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. జెండాగల్లీలో తెల్లవారుజామున కానిస్టేబుళ్ల పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పలువురు దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు ఉన్నా, ఒక్కరిపైనే కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది.

భయపడే ఆత్మహత్యాయత్నం!

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బుధవారం ఎస్‌హెచ్‌వో మహేష్ మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన రమేష్, ముబారక్‌నగర్ చెందిన యువతీ ఇంట్లోంచి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టగా, ఇరు కుటుంబాలు రమేష్‌పై కోపానికి రావడంతో భయభ్రాంతులకు గురై ఆత్మహత్యకు యత్నించినట్లు వివరించారు. రమేష్‌పై కేసు నమోదు చేయలేదన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నిజామాబాద్‌రూరల్: రైల్వే శానిటేషన్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ (బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నిజామాబాద్ సీనియర్ సెక్షన్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

సమ్మె తాత్కాలిక వాయిదా

నిజామాబాద్ రూరల్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 నుంచి చేపట్టనున్న సమ్మెను వాయిదా వేస్తున్నట్లు దండి వెంకట్ తెలిపారు. నగరంలో బుధవారం జరిగిన సమావేశంలో అధికారుల విజ్ఞప్తి మేరకు 28 వరకు వాయిదా వేశామన్నారు.

కార్యాలయంలో మద్యం సేవించిన బల్దియా ఉద్యోగులు

- విధుల్లో నుంచి ఇద్దరి తొలగింపు

నిజామాబాద్‌అర్బన్: విధుల్లో ఉన్న ఇద్దరు మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు నగరంలోని కంఠేశ్వర్ జోన్ కార్యాలయంలో మద్యం సేవిస్తూ కమిషనర్‌కు పట్టుబడ్డారు. ఈ ఘటన గతకొన్ని రోజుల క్రితం చోటు చేసుకుందని, ఆకస్మిక తనిఖీకి వెళ్లిన సమయంలో ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మద్యం సేవిస్తూ పట్టుబడ్డారని బుధవారం ఒక ప్రకటనలో కమిషనర్ మంద మకరందు తెలిపారు. సదరు ఉద్యోగులను హెచ్చరించి విచారణ చేపట్టామని, అనంతరం ఇద్దరిని ఉద్యోగాల్లో నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు.

ఆలస్యం ఎందుకు..?

విధుల్లో ఉన్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మద్యం సేవిస్తూ పట్టుబడినప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం ఎందుకు జరిగిందనే ప్రశ్న తలెత్తుతోంది. ఘటన జరిగిన చాలా రోజుల తర్వాత ప్రకటన విడుదల చేయడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సిరికొండలో బంద్ విజయవంతం

సిరికొండ: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ బుధవారం మండలకేంద్రంలో హిందూ సంఘాలు చేపట్టిన బంద్ విజయవంతమైంది. బంద్‌కు మద్దతుగా వ్యాపారులు తమ దుకాణాలను మూసిఉంచారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	150
		లైవ్	110
స్కిన్‌లెస్	180	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,300	వెండి (కిలో)	85,800
22 క్యారెట్స్	67,617		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	40	60
బెండకాయ	25	50	పచ్చిమిర్చి	45	60
బీరకాయ	35	50	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	60	90	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	35	60
పాలకూర	50	70	కరివేపాకు	50	70
మెంతికూర	60	80	చామగడ్డ	50	70
కొత్తిమీర	50	75	గోరుచిక్కుడు	40	60
పుదీనా	70	90	చిక్కుడుకాయ	35	50
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-10.25, 4.30,10.35 మిస్టర్ బచ్చన్(తెలుగు)-1.30,7.35
స్క్రీన్-2	స్త్రీ-2(హిందీ)- 10.30 తంగలాన్(తెలుగు)-1.30,7.35 ఆయ్(తెలుగు)-4.35,10.35
స్క్రీన్-3	మిస్టర్ బచ్చన్(తెలుగు)- 10.20,10.40 డబుల్ ఇస్మార్ట్ (తెలుగు)-1.25,7.30 స్త్రీ-2(హిందీ)- 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-9.00,7.05 మిస్టర్ బచ్చన్(తెలుగు)-12.25,10.30 స్త్రీ-2(హిందీ)-3.50
స్క్రీన్-2	మిస్టర్ బచ్చన్(తెలుగు)-9.10,7.15 డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-12.35,10.40 కమిటీ కుర్రోళ్ళు(తెలుగు)- 4.00
స్క్రీన్-3	స్త్రీ-2(హిందీ)-9.50,1.05,10.40 ఖేల్ ఖేల్ మెయిన్(హిందీ)- 4.20 తంగలాన్(తెలుగు)-7.20
స్క్రీన్-4	తంగలాన్(తెలుగు)-9.30, 12.50,4.10 ఆయ్(తెలుగు)-7.30 వేదా(హిందీ)- 10.35
దేవి	కమిటీ కుర్రోళ్ళు - 11.15 , 2.15 ఆయ్ (తెలుగు)-6.15,9.15
నటరాజ్	స్త్రీ-2(హిందీ)
విజయ్	మిస్టర్ బచ్చన్(తెలుగు)
లలితామహల్	డబుల్ఇస్మార్ట్(తెలుగు)